
రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



## భారీ వర్షానికి కూలిన ఇంటి గోడ



**ధారూరు,సెప్టెంబరు 27, ప్రభాతవార్త:** ధారూర్ మండలంలోని గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన తోపు బాలయ్య ఇంటి గోడ కూలిపోయింది. బాధితుడు,స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, గురువారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి శుక్రవారం రాత్రి బాలయ్య ఇంటి గోడ కూలిందని, ఆ సమయంలో ఎవరు కూడా అక్కడ లేకపోవడంతో పె ను ప్రమాదం తప్పిందని అన్నారు.ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని, ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని గ్రామస్తులు బాధితుడు కోరుతున్నారు. కాగా, భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్పా బయటకు వెళ్లొద్దని అధికారులు సూచించారు.

## సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ



**కీసర,సెప్టెంబరు27,ప్రభాతవార్త:** సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని దమ్మాయిగూడ మున్సిపల్ కమీషనర్ వెంకట్‌రెడ్డి అన్నారు.శనివారం మున్సిపల్ ఆవరణలో సమ భావన సంఘాల మహిళలు,మున్సిపల్ కార్యాలయ సిబ్బందితో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ తెలంగాణలో బతుకమ్మ పండుగ వెయ్యి ఏండ్ల నాటిదని బతుకమ్మ పండుగ తెలంగాణ యొక్క సంస్కృతి,సాంప్రదాయాలకు ప్రతీక అని,ప్రకృతిని,పుడమి తల్లిని స్థానికంగా దొరికే తంగేడు, గునుగు ,బంతి,చామంతి పూలతో అలంకరించి గౌరి దేవికి కృతజ్ఞతలు తెలుపుతూ ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ జరుపుకునే స్త్రీల పండుగ బతుకమ్మ అన్నారు.అనంతరం బతుకమ్మ చేసిన మహిళలకు మొదటి,ద్వితీయ,తృతీయ బహుమతులు అందజేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో డిఈఈ బాలమురళి,మేనేజర్ వెంకటేశ్,ఎస్ఐ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జెడ్‌పిటిసి, ఎంపిపి స్థానాల రిజర్వేషన్ల కేటాయింపు

### కలెక్టర్ సి నారాయణ రెడ్డి



**రంగారెడ్డిఅర్బన్,సెప్టెంబరు27,ప్రభాతవార్త:-** రంగారెడ్డిలోని 21 జెడ్‌పిటిసి,ఎంపిపి స్థానాలకు శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ సిఈఓ కృష్ణారెడ్డి తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మహిళా రిజర్వేషన్ల కేటాయింపు ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా జిల్లాలోని జెడ్.పి.టి.సి., ఎంపిపి. స్థానాల కొరకు ఎస్‌టి,ఎస్‌సి, బిసి, జనరల్ రిజర్వేషన్లకు సంబంధించి మహిళా రిజర్వేషన్ కొరకు లాటరీ పద్ధతిన కేటాయింపు నిర్వహించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్‌సి,ఎస్‌టి రిజర్వేషన్లు,బిసి. డెడికేషన్ కమిటీ నివేదిక ప్రకారం బిసి రిజర్వేషన్ చేపట్టడం జరిగిందని తెలిపారు. జెడ్‌పిటిసి కొరకు ఎస్‌టి-3,ఎస్‌సి-4, బిసి-9,జనరల్-5 స్థానాలు కేటాయించడం జరిగిందని, వీటిలో9 స్థానాలు మహిళలకు కేటాయించడం జరిగిందనితెలిపారు. ఎంపిపి కొరకు 3 ఎస్‌టి-3, ఎస్‌సి-4, బిసి-9,జనరల్-5 స్థానాలు కేటాయించడం జరిగిందని, వీటిలో 9 స్థానాలు మహిళలకు కేటాయించడం జరిగిందని తెలిపారు. సంబంధిత రిజర్వేషన్ స్థానాల కేటాయింపు వివరాలను ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని నాగన్‌పల్లి రోడ్డు నుండి టీజీఎస్పీ మూడవ బెటాలియన్ వరకు రూ.60కోట్ల హెచ్‌ఎండీఏ నిధులతో నిర్మించనున్న బిటి రోడ్డు పనుల శిలాఫలకను అవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే అగ్ర స్థానాన్ని సంపాదించిందని ఆయన కొనియాడారు.గత ప్రభుత్వ పాలకులు అభివృద్ధిని గాలికి వదిలి పబ్బం గడుపుకున్నారని అయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇల్లు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500లకే వంట గ్యాస్ సలిండర్, రెండు వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌లాంటి పథకాలతో పేదలకు లబ్ధి చేకూరుతుందన్నారు.ముందుగా ఆయన ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయ సముదాయంలో ఇందిరమ్మ మోడల్ ఇల్లును ప్రారంభించారు. అనంతరం ఎస్‌బిఐ బ్యాంకు పక్కన ఏర్పాటు చేసిన మండపంలోని దుర్గామాత పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీజీఎస్పి మూడో బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ బాష, అడిషనల్ కమాండెంట్ శ్రీనివాస్ రావు, మున్సిపల్ కమీషనర్ సత్యనారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ కె.గురునాథ్ రెడ్డి, ఉప్పరిగూడ పిఎసిఎస్ ఛైర్మన్ ఏదుల్ల పాండురంగారెడ్డి,కాంగ్రెస్‌నాయకులు ఇ.సి.శేఖర్ గౌడ, నీల్ల భానుబాబు, కె.వి.రమేష్,బర్ల జగదీశ్వర్ యాదవ్, కప్పరి చందు, తాలపల్లి కృష్ణ, మాంఖాల దాసు, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యకుడు సికిందరెరెడ్డి పాల్గొన్నారు.

# జిల్లాకు రెడ్ అలెర్ట్ : మూడోరోజూ నదుల ఉగ్రరూపం

**తాండూరులో తెగిపోయిన కాగ్నా వంతెన**
**ద్వీపంలా మారిన వీర్‌శెట్టిపల్లి**
**పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే**
**అవసరమైతేనే బయటకు రావాలని సూచన**



కాగ్నానదిఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీ.

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** జిల్లాలో మూడో రోజూ కూడా వరద ఉధృతి కొనసాగింది.అతిభారీ వర్షాలు జిల్లాను అతలాకుతలం చేస్తున్నాయి. అధికార యంత్రాంగం రెడ్ అలెర్ట్ ప్రకటించింది. అవసరమైతేనే ప్రజలు బయటకు రావాలని హెచ్చరించింది. వరద ఉధృతికి కాగ్నా, కాకరవేణి, మూసీ, ఈసీ నదులు ఉగ్రరూపం దాల్చాయి. ముందెన్నడూ లేని విధంగా ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. కాగ్నా ప్రవాహ ధాటికి తాండూరు సెగ్మెంట్‌లోని యాలాల మండలం కోకట్ వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డు వంతెనకు భారీగా గండిపడింది. దానివల్లఅనేకగ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. 1988లో అప్పటి సీఎం నందమూరి తారక రామారావు కోకట్ గ్రామంలో వంతెనకు శంకుస్థాపన చేశారు. మంత్రి ఇంద్రారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే చందుమహారాజ్ తదితరుల కృషి ఫలితంగా కోకట్ వంతెన నిర్మించారు. ప్రస్తుతం వరద ఉధృతికి భారీ గండి ఏర్పడి తాండూరు నుంచి రాస్నం, ముద్దాయిపేట,బొంరాస్‌పేట, రాఘవాపూర్, పగిడ్యాల తదితర 40 గ్రామాలకు రవాణా సౌకర్యానికి బ్రేక్ పడింది. వర్షాలు తగ్గిన తర్వాత తాత్కాలిక మరమ్మతులు చేస్తామని ఎమ్మెల్యే బీ.మనోహర్‌రెడ్డి తెలిపారు. కాగ్నా నది ఉప్పొంగి ప్రవహించడంతో తాండూరు మండలం వీర్‌శెట్టిపల్లి, గోనూరు గ్రామాల్లోకి భారీగా వరదనీరు చేరింది. దాంతో రాత్రంతా ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. శనివారం కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రభావిత ప్రాంతాలను సందర్శించి ఎలాంటి ఉపద్రవం వచ్చినా అందుబాటులో ఉంటూ ఆదుకుంటామని ప్రజలకు భరోసా ఇచ్చారు.ఈ గ్రామాల చుట్టూ నీరు చేరడంతో ద్వీపంలా మారింది. జిల్లా అంతటా కలిపి 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.పూడూరు,వికారాబాద్, నవాబ్‌పేట మీదుగా ఈసీ, మూసీ నదులు పొంగిపొర్లాయి. దాదాపు 80 వేల ఎకరాల పంటపొలాలు నీట మునిగినట్లు ప్రాథమిక అంచనా. చేతికి వచ్చిన మినుము, పెసర, పత్తి పంటలపై వర్ష ప్రభావం తీవ్రంగాఉంటుంది. కంది,చెరుకు పంటలకూ అపార నష్టంవాటిల్లు తుందని రైతులు దిగాలు చెందుతున్నారు.



వర్షంలో పర్యవేక్షిస్తున్న దృశ్యం

## రిజర్వేషన్లు అమలుతో ఉలిక్కిపడిన రాజకీయ పార్టీల నాయకులు

**మహిళా రిజర్వేషన్ల ప్రకటనతో ఉలికిపడిన నాయకులు**
**ఎన్నికల బరిలో భార్యలను దింపడానికి జెంకుతున్న భర్తలు**
**సుదీర్ఘ ఆలోచనలు చేస్తున్న రాజకీయ పార్టీల నాయకులు**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, సెప్టెంబరు 27 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేయడంతో పాటు రిజర్వేషన్లను ప్రకటించడంతో స్థానికంగా ఎంపీపీలు జడ్పీటిసి స్థానాల కోసం ఎంపీటీసీల కోసం పోటీలో దిగడానికి రంగం సిద్ధం చేసుకున్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు రిజర్వేషన్లు తమకు అనుకూలంగా రాకపోవడంతో ఆశావాహులు ఒకసారిగా ఉలికి పాటుకు గురయ్యారు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల బరిలోకి దిగదామని ఆశించి గత కొన్ని నెలలుగా ఎంపీపీల కోసం జడ్పీటిసిల సీటు కోసం దిగుతామంటూ గ్రామాల్లో ప్రచారం చేసుకుంటున్నా ఆయా రాజకీయ పార్టీల నాయకులు రిజర్వేషన్ల తమకు అనుకూలంగా రాకపోవడంతో అయోమయంలో పడ్డారు.

అనుకున్నదొక్కటి అయ్యిందొకటి బొల్తా కొట్టిందిలే బులిబులి పిట్ట. ఎంపీపీ, జడ్పీటిసిలా పదవి కాలం పూర్తి అవుతున్న ఇంతవరకు స్పెషల్ ఆఫీసర్ పాలన కొనసాగుతుండడంతో ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల నిర్వహించడానికి శ్రీకారం చుట్టడంతో మండలాలు గ్రామాల్లో ఒకసారిగా రాజకీయ వేడి మొదలైంది. ఆశించిన వారికి రిజర్వేషన్లు మండలాల్లో ,గ్రామాల్లో అనుకూలంగా రాకపోవడంతో కొంతమంది వివిధ రాజకీయ పార్టీల నాయకులు శనివారం రోజు కొంత నిరుత్సాహంతో కనిపించారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని ప్రకటించడం కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడం 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర క్యాబినెట్ తీర్మానం చేయడం తీర్మానం చేసిన నివేదికను ఆర్డినెన్స్ కోసం రాష్ట్ర గవర్నర్‌కు పంపడం చకచకా పూర్తి చేసినప్పటికీ సానుకూలంగా న్యాయపరమైన చిక్కులు తలెత్తు తాయని పలువురు రాజకీయ మేధావులు అభిప్రాయపడుతు న్నప్పటికీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో వాడి వేడిగా చర్చలు కొనసాగుతున్నాయి. అత్యధిక శాతం గ్రామాల్లో బీసీలు ఎస్సీలు ఎస్టీలు కొన్ని స్థానాల్లో మాత్రం జనరల్ కేటగిరీ కింద ప్రకటించారు. ప్రకటించిన రిజర్వేషన్లలో కూడా అత్యధిక శాతం మహిళల కేటాయిస్తూ లాటరీ సిస్టంలో రిజర్వేషన్లను ప్రకటించారు. నేరుగా ఎంపీపీ ఎంపీటీసీ జడ్పీటిసి స్థానాలకు రంగంలోకి దిగుదామని ఆశించిన రాజకీయ పార్టీల నాయకులకు మహిళా కోట కింద మహిళా అభ్యర్థులే ఉండాలనే నిబంధనతో రాజకీయ నాయకుల గుండెల్లో గుబులు పుట్టుకొస్తుంది. ఎంపీపీ ఎంపీటీసీ జెడ్పిటిసి అభ్యర్థులుగా తమ భార్యలను రంగంలోకి దింపడానికి విముఖత చూపుతున్నారు. గత కొన్ని నెలలుగా పోటీలో ఉంటామని ఆశించిన వారికి కొంత బంగపాటు గురయ్యారు.

## మండలంలో కురుస్తున్న వర్షం



**జిల్లేడుచౌదరిగూడెం,సెప్టెంబరు,27 (ప్రభాతవార్త) :** జిల్లెడు చౌదరిగూడ మండలంలో గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండ వర్షం కురుస్తుంది. దీంతో వాగులు వంకలు వర్షపు నీటితో ఉరకలు తీస్తున్నాయి. చెరువులు, కుంటలు నిండు కుండలను తలపిస్తున్నాయి. ప్రస్తుతం చేతికి వచ్చిన జొన్న పంటలు నష్టపోయే అవకాశం ఉందని మండల రైతులు అంటున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. వర్షాల కారణంగ నష్టపోయిన ప్రతి ఒక్కరిని ఆదుకోవాల్సిన భాద్యత ప్రభుత్వంపై ఉందని పలువురు అభిప్రాయపడుతన్నారు.

## ఆకాల వర్షంతో రైతన్న అయోమయం

**కోట్‌పల్లి,సెప్టెంబరు 27, ప్రభాతవార్త;** కోట్‌పల్లి మండల వ్యాప్తంగా రెండు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి పంటలన్ని నెలమట్టం అయ్యాయి. దింతో రైతన్నలు దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు.ఖరీఫ్‌లో వ్యవసాయంలో వరుణ దేవుడు కక్షకట్టాడు.వానలుకురిసి పంటలు నీటిలో మునిగి కుళ్లిపోతున్నాయి. చేతికొస్తున్న పంటలు పండిన జీవనోపాధికి రైతుల నోటికి మట్టి కొట్టినట్లైంది.వ్యవసాయ పంటలన్ని వర్షానికి పూర్తిగా దెబ్బతిన్నడంతో రైతులను కదిలిస్తే కళ్లలో నీరు వస్తున్నాయి. మరోవైపు కురిసిన వానలకు ప్రధాన రహదారులు కోతకు గురయ్యాయి.

**వర్షబాధిత రైతులకు ప్రభుత్వం అదుకోవాలి...**

వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల వ్యాప్తంగా వ్యవసాయ పంట పోల్లాలన్ని వర్షానికి దెబ్బతిన్న పంటలను రైతులను ప్రభుత్వం అదుకోవాలని రైతన్నాలు కోరుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వర్షానికి పత్తి పంట నీట మునిగిన రైతులు వివరాలు సేకరించి రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని రైతన్నాలు కోరుతున్నారు.



## ఆచార్య కొండా లక్ష్మణ బాపూజీ ని స్ఫూర్తిగా తీసుకోవాలి

### -జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్



కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణా ఉద్యమ కారకులు, స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారని, ప్రతి ఒక్కరు అయనను స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ సుదీర్ అన్నారు. శనివారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ సమావేశము హాలు నందు జిల్లా వె ుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 110 వ జయంతి సందర్భంగా అయన చిత్ర పటానికి అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, డిఆర్ఓ మంగీ లాల్ తో కలిసి జ్యోతి ప్రజల్వన చేసి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడుగా, తెలంగాణ స్వరాష్ట్ర సాధనలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ముఖ్య పాత్ర పోషించారని అన్నారు. వారి సేవల ు స్మరించుకుంటూ జయంతి వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు.1969వ సంవత్సరంలో తొలి దశ పోరాటంలోనే కీలక పాత్రా పోషించి, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి అండగా దీక్ష ను చేయడమే కాకుండా తన మంత్రి పదవిని తృణప్రాయంగా వదిలేసి ఉద్యమానికి అండగా నిలిచిన మహనీయులు కొండా లక్ష్మణ్ బాపూజీ అని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకై పోరాడిన యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తనకంటూ ఏమి లేకుండా బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి సమావేశాలు ఏర్పాటు చేసుకొ నుటకు తన యొక్క ఆస్తులు మొత్తం కూడా దానం చేసిన త్యాగశీలి అని కొనియాడారు.

ఆయన తుది శ్వాస వరకు తెలంగాణ రాష్ట్ర సాధనకు మరియు బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి చెందాలని ఆశించారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల సేవల ు గుర్తించి అనేక కార్యక్రమాల ు అధికారికంగా జరపడం సంతోషాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమములో బిసి సంక్షేమ అధికారి మాధవ రెడ్డి, డీటీడీఓ కమలాకర్ రెడ్డి, మత్స్య శాఖ అధికారి వెంకయ్య, పంచాయత్ రాజ్ ఈ ఈ ఉమేష్ కుమార్, శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి పాల్గొన్నారు.

## వాగులో పడి మృతి చెందిన దస్తగిరి లింగం శవంతో ఎమ్మెల్యేఆఫీసు వద్ద ఆందోళన



మృతదేహంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

**చొచ్చుకెళ్లిన నాయకుడు చొక్కా పట్టి ఈడ్చుకొచ్చిన పోలీసులు..!**
**రూ.50 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని నినాదాలు..**

**షాద్‌నగర్, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే ప్రభుత్వ క్యాంపు కార్యాలయం వద్ద శనివారం ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. నియోజకవర్గంలోని కొందుర్గు మండలం విగ్గిర్యాల గ్రామానికి చెందిన దస్తగిరి లింగం నిన్న కురిసిన అతి భారీ వర్షాలకు ప్రవహిస్తున్న వాగులోకి వెళ్లి మృత్యువు పాలయ్యాడు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులోకి వెళ్లిన లింగం మరణించడంతో వాగు పై వంతెన లేని కారణంగా ఈ ప్రాణం పోయిందని ఆరోపిస్తూ బిజెపి కార్యకర్త ప్రశాంత్ తదితర గ్రామస్తులు బంధువులు లింగం శవంతో శనివారం షాద్ నగర్ పట్టణం వచ్చి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కన రహదారిపై రాస్తారోకోకు దిగారు. ఈ సందర్భంగా పోలీసులకు ఆందోళనకారులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. పోలీసులు శవాన్ని రోడ్డుపై నుండి తీసివేస్తున్న సమయంలో బిజెపి కార్యకర్త ప్రశాంత్ తదితరులు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోకి బలవంతంగా వెళ్ళాడు. కార్యాలయంలో ఆ సమయంలో ఎమ్మెల్యే శంకర్ లేరు. అయినప్పటికీ ఆగ్రహంతో ప్రశాంత్ కార్యాలయంలోకి చోచ్చుకు వెళ్లడంతో పరిస్థితి ఉధృతంగా మారింది. ప్రశాంత్ పెద్ద ఎత్తున పరుగులు తీస్తూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోకి వెళ్లడంతో ఆయన వెంటనే స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ తదితర సిబ్బంది పరుగులు తీశారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య వావివాదం జరగడంతో క్యాంపు కార్యాలయంలో ప్రశాంత్ అనుమతి లేకుండా దూసుకు వెళ్లడం పట్ల పోలీసులు ముందస్తు చర్యగా శాంతిభద్రతల పరిరక్షణ కోసం అతన్ని బలవంతంగా అదుపులోకి తీసుకోవాల్సి వచ్చింది. ఈ సందర్భంగా పోలీసులు లాఠీకి పని చెప్పారు. ప్రశాంత్ ను చొక్కా పట్టుకుని బయటికి ఈడ్చుకోవచ్చారు. అనంతరం అతన్ని అతనితోపాటు ఉన్నవారిని పోలీస్ స్టేషన్ కు తరలించారు. మృతుడు దస్తగిరి లింగం వెంకిర్యాల గ్రామానికి చెందిన వాడుగా స్థానికులు చెబుతున్నారు భార్య ముగ్గురు కుమార్తెలు ఉన్నారు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో హౌస్ కీపర్ గా అతని భార్య పనిచేస్తుంది తనను తీసుకోరావడానికి తంగేడుపల్లి గేట్ దగ్గరికి వెళ్లే క్రమంలో విశ్వనాథపూర్ తంగేళ్లపల్లి మధ్య వాగు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో అతను వాగు దాటి మృత్యుపాలు అయ్యాడు. ప్రమాద భరితంగా కొనసాగుతున్న వాగును చూసి కూడా నిరక్ష ్యంతో దస్తగిరి లింగం వాగు దాటాడని స్థానికులు చెబుతున్నారు.



బిజెపి కార్యకర్త ప్రశాంత్ ను లాకెళ్తున్న పోలీసులు

## ఎమ్మెల్యే దానం ఇంట్లో బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ వేడుకల్లో ఆడిపాడుతున్న దానం నాగేందర్ సతీమణి, మనువరాళ్లు కుటుంబ సభ్యులు.

**బంజారాహిల్స్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:**
ఖైరతాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే దానం నాగేందర్ నివాసంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలువురు రాజకీయ నాయకులతోపాటు పారిశ్రామికవేత్తలు, కుటుంబ సభ్యులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దానం నివాసంలో వివిధ ఎత్తుల్లో బతుకమ్మలను పేర్చారు. దానం సతీమణి దానం అనిత, తన కుమార్తె, మనువరాళ్లతో కలిసి బతుకమ్మ పాటలు పాడారు. ఈ సందర్భంగా దానం నివాసాన్ని రంగురంగుల విద్యుత్‌దీపాలతో అలంకరించారు. మనువరాళ్ల బతుకమ్మ ఆటను చూసిన దానం నాగేందర్ ఆనందానికి అవధులు లేవు.

## ఏడుకొండలవాడి ఆలయంలో 'సేవా'నందం



స్వామివారి సూర్యప్రభవాహన సేవలో పాల్గొన్న భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:**
శ్రీనగర్‌కాలనీలో వెంకటేశ్వరస్వామి దేవాలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలో భాగంగా శనివారం వివిధ రకాల సేవలు, పూజలతో ఉత్సవాలను కన్నుల పండుగగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 10 గంటలకు సూర్యప్రభ వాహన సేవను, రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహన సేవను నిర్వహించారు. ఆలయంలో ఉదయం 6 గంటలకు స్వామివారికి సుప్రభాతసేవ నిర్వహించారు. సేవల్లో భాగంగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారిని వాహనంపై ఆలయ వీధుల్లో ఊరేగించారు. ఏడుకొండలవాడ అంటూ భక్తులు భక్తిపారవశ్యంతో ముందుకు సాగారు.

**లలితాదేవి అలంకారంలో..**

వెంకటేశ్వరస్వామి దేవాలయంలోని భ్రమరాంబిక దేవి అమ్మవారు శనివారం భక్తులకు లలితాదేవి అలంకారంలో దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. శనివారం కావడంతో భక్తులు ఉదయం నుంచి పెద్దసంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు చేపట్టినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## ఘనంగా పురపాలక సంఘ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

**దుండిగల్, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త**
పురపాలక సంఘ కార్యాలయం ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకల్లో కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్, రెవెన్యూ ఆఫీసర్ వి. నాగేశ్ బాబు, మేనేజర్ బి. లక్ష్మయ్య, అలాగే కార్యాలయ సిబ్బంది పాల్గొని బతుకమ్మ పండు గను ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతిక సంప్రదాయాలకు ప్రతీక అని, పూలతో సాగే ఈ పండుగ సాంప్రదాయ విలువలు, మహిళల ఆత్మగౌరవాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. ఇలాంటి సంప్రదాయ పండుగలను ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా జరుపుకోవాలని పేర్కొన్నారు.

## డిసిపి కోటిరెడ్డిని కలిసిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న డిసిపి కోటిరెడ్డి

**పేట్ బషీరాబాద్, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త**
బెంగళూరులో నిర్వహించిన నేషనల్ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులు శనివారం డిసిపి కోటిరెడ్డిని కలిసారు. ఈ సందర్భంగా డిసిపి విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ, పెద్ద లక్ష్యాలను సాధించేందుకు మంచి పథకాలు అవలంబించాలని సూచించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## తెలుగు సినీ యూనియన్‌లో దొంగ సభ్యత్వాలు..

**తెలుగు సినిమా వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి**



**చిక్కడపల్లి, సెప్టెంబరు 27 ప్రభాతవార్త:**
తెలుగు సినీ డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్లో దొంగ సభ్యత్వాలతో యూనియన్ ఎన్నికల్లో గెలిచేందుకు కొందరు పన్నుతున్న కుట్రలను తిప్పికొట్టేందుకు గాను 28న జరు గనున్న ఎన్నికలను వాయిదా వేయాలని కోరుతూ తెలంగాణ సినిమా వేదిక సభ్యులు పలువురు శనివవారం రాష్ట్ర కార్మికశాఖ అదనపు కమిషనర్ డా.ఇ. గంగాధర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలుగు సినిమా వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు, సలహాదారు తుమ్మల ప్రఫుల్రాంరెడ్డి, అధ్యక్షులు లారా, కార్యదర్శి మోహన్ బైరాగిలు మాట్లాడుతూ తెలుగు డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్‌లో వెల్లంకి శ్రీనివాస్, కెడి రాజు, నర్సింహారెడ్డి ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతుందన్నారు. ఈ ముగ్గురు సభ్యత్వం పేరిట సేకరి ంచిన డబ్బుల లెక్కలు తేలిన తర్వాత, దొంగ సభ్యత్వాలను తొలగించిన పిదప ఎన్నికలు నిర్వహించే విధంగా ఉత్తర్వులు జారీ చేయాలని కార్మికశాఖ అదనపు కమి షనర్ గంగాధరన్ను కోరినట్లు వివరించారు. గత పది సంవత్సరాలుగా యూనియన్లో సభ్యత్వాల డబ్బు ఎంత వచ్చింది. రెన్యూవల్స్ డబ్బులు వాటి వివరాలు, వసూళ్ళు చేసినవి ఎంత, వాటి వివరాలు ఇప్పటికి చెప్పడం లేదన్నారు. తమ వెనుక గంజాయి బ్యాచ్ ఉందని బెదిరిస్తున్నారని ఆరోపించారు. కెసిఎస్ ప్రసాద్, శంకర్, గోవింద్రరాజు, సుజి, రవి, అజయ్ కుమార్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



కార్వాన్ న్యూ గంగానగర్ కనకదుర్గ దేవాలయంలో లలిత త్రిపుర సుందరి దేవి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు.



కార్వాన్ సాయి నగర్ లో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన బిఆర్ఎస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గ ఇన్ ఛార్జ్ ఠాగూర్ జీవన్ సింగ్



హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అమ్మవారికి పూజలు చేసిన టిఎన్‌జిఓ కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీష్,ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ



నగదుతో లక్ష్మీదేవి అలంకారంలో విజయగణపతి ఆలయంలో అమ్మవారు



చిక్కడపల్లి బాపూనగర్‌లో రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో లలితాదేవి అలంకారంతో అమ్మవారు



నేతాజీ (ఫ్రెండ్స్) అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారు కాళికా అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు



,శ్రీ భక్తహనుమాన్ దేవాలయంలో అమ్మ వారి వద్ద పూజలు నిర్వహిస్తున్న స్థానికులు.



నిజాంపేట్‌లో వెలసినటువంటి పురాతనమైనటువంటి శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కుటుంబ సభ్యులు



రాజ్‌నగర్‌లో దేవీ నవరాత్రులు సందర్భంగా అమ్మవారి మండపం వద్ద అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్.



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఈటెల రాజేందర్, వడ్డేపల్లి రాజేశ్వరరావు

## విధి నిర్వహణలో ఉన్న ముగ్గురు కార్మికులపై దాడి

**దుండిగల్, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త**
విధి నిర్వహణలో ఉన్న ముగ్గురు కార్మికులపై ఓటీ టైం యజమాని అతని కుమారులు దాడి చేయగా ఓ కార్మికునికి తీవ్రగాయాలు అయ్యాయి. మరో ఇద్దరు మహిళా కార్మికులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని వెంటనే స్థానికంగా ఉండే ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. సమాచారం అందుకున్న మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర నాయక్ ఆసుపత్రికి వెళ్లి గాయపడ్డ కార్మికులను పరామర్శించి మెరుగైన చికిత్స అందించాలని ఆసుపత్రి యాజమాన్యానికి సూచించారు. కాగా కార్మికులపై దాడి జరిగి న సంఘటనను తెలుసుకున్న మున్సిపల్ కార్మికులు బహదూరపల్లిలోని సిరి సంపద ఫుడ్ కోర్ట్ పక్కన ఉన్న శ్యాం టీ టైం ముందు సిఐటియు నాయకుడు బొడిగే లింగ స్వామి ఆధ్వర్యంలో ధర్నాకు దిగారు. స్థానికుల సమాచారం ప్రకారం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బహదూర్‌పల్లి మున్సిపల్ కార్మికులు దుడ్డు సురేందర్, దుడ్డు బాలమని, కొమ్ము వెంకటమ్మ రోజులాగే శనివారం ఉదయం ఆరు గంటలకు బహదూరపల్లి వీధుల్లో చెత్త ఊడ్చే పనిలో పడ్డారు. సిరి సంపద ఫుడ్ కోర్ట్ పక్కన ఉన్న శ్యాం టీ స్టాల్ దగ్గరకు రాగానే టీ స్టాల్ ముందు రోడ్డుపై చెత్త వేస్తుండగా మున్సిపాల్ కార్మికుడు దుడ్డు సురేందర్ టీ స్టాల్ యజమాని శ్యాంను వారించాడు. మాటా మాటా పెరగడంతో అదుపుతప్పిన శ్యాం అతని కుమారులు మొత్తం నలుగురు కలసి మున్సిపల్ కార్మికుడు దద్దు సురేందర్‌ను విచక్షణా రహితంగా దాడి చేశారు. అడ్డు తగిలిన మరో ఇద్దరు మహిళా కార్మికులు దుడ్డు బాలమని, కొమ్ము వెంకటమ్మలపైన దాడికి దిగాడు. అక్కడే ఉన్న మాజీ మున్సిపల్ కౌన్సిలర్ భరత్ కుమార్ వారించారు. కార్మికులకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం వెంటనే ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.



గాయపడిన కార్మికున్ని పరామర్శిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్..

## తెలుగు సాహిత్యానికే తలమానికం చిలకమర్తి : కె.వి.రమణాచారి

**రవీంద్రభారతి, సెప్టెంబరు 27 ప్రభాతవార్త :** చిలకమర్తి లక్ష్మీనరసింహం ఇరవై రెండేళ్ల వయస్సులో రచించిన గయోపాఖ్యానం అనే నాటకం ప్రతులు లక్షకుపైగా అమ్ముకుపోవడమనేది తెలుగు సాహిత్యానికే తలమానికం, మకుటాయమానమని విశ్రాంత ఐఎఎస్ అధికారి, తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, డా. కె.వి.రమణచారి అన్నారు. గొప్ప కవి, రచయిత, నాటకకర్త, విద్యావేత్త, సంఘ సంస్కర్త అయిన చిలకమర్తి 19చివర, 20వ శతాబ్ధం ఆరంభకాలంలో తెలుగు సాహిత్యం అభివృద్ధికి, తెలుగునాటఆధునికభావాల వికాసానికి పట్టుకొమ్మలై తెలుగుభాష సాహిత్యాలను సుసంపన్నం చేశారని కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ఎన్.ముక్తేశ్వరరావు అధ్యక్షతన జరిగిన చిలకమర్తి లక్ష్మీనరసింహం 158వ, చిలకమర్తి మల్లయ్యశాస్త్రి 106వ జయంతి సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి విశిష్ట అతిథులు సుబ్బరాయశర్మ, చిలకమర్తి సోదరులు, కిన్నెర రఘురాం తదితరులతో కలిసి ప్రముఖ నాటక రచయిత, నటుడు, దర్శకుడు తడకమళ్ళ రామచందర్‌రావు దంపతులను ఘనంగా సత్కరించి కిన్నెర-చిలకమర్తి సాహితీ పురస్కారం బహూకరించి శుభాభినందనలు తెలిపారు. తడకమళ్ళ 6దశాబ్ధాలుగా తెలుగు నాటకరంగంలో నటుడు, రచయిత, దర్శకుడుగా తనదైన ముద్రవేసుకున్నారన్నారు. ముందుగా సభకు కిన్నెర రఘురాం స్వాగతం పలికారు.



కిన్నెర-చిలకమర్తి సాహితీ పురస్కారంతో రామచందర్‌రావు దంపతులను సత్కరిస్తున్న రమణాచారి, రఘురాం, ముక్తేశ్వరరావు తదితర అతిథులు

## అమ్మ వారికి ఉప ముఖ్యమంత్రి భట్టి సతీమణి పూజలు

**బేగంపేట సెప్టెంబరు 27,ప్రభాతవార్త**
దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం బేగంపేట శ్రీ కట్టమైసమ్మ అమ్మవారి ఆలయంలో శ్రీభువనేశ్వరీదేవీ అలంకారంలో అమ్మ వారు భక్తులకు దర్శనం ఇచ్చారు.ఈ సందర్భంగా అమ్మ వారికి తెలంగాణా ఉప ముఖ్యమత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని ఆలయాన్ని సందర్శించి అమ్మ వారికి పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ఈ ఓ విఠలయ్య,ఫౌండర్ ఛైర్మన్ చెక్కల సుభాష్ ముదిరాజ్‌లు నందినిని ఘనంగా సత్కరించి ప్రత్యేక పూజలు నిర్వహింపజేసారు.తీర్ధ ప్రసాదాలను అందజేసారు. ఈ సందర్భంగా నందిని భట్టి మాట్లాడుతూ అమ్మ వారు ప్రజలందరినీ చల్లంగా చూడాలని,రోగాల బారిన పడకుండా రక్షించాలన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేసారు.శ్రీకట్టమైసమ్మ అమ్మ వారి ఆలయంలో శ్రీభువనేశ్వరీదేవి అమ్మ వారిని సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డా.కోట నీలిమ,కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు విశాల్‌సుధాం, రాజేందర్,దర్శించుకుని పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ఫౌండర్ ఛైర్మన్ చెక్కల సుభాష్ ముదిరాజ్ కోట నీలిమ,కాంగ్రెస్ నాయకులను సత్కరించి పూజలు నిర్వహింపజేసారు.అనంతరం తీర్ధ ప్రసాదాలను అందజేసారు.



భువనేశ్వరీదేవీ అమ్మ వారిని దర్శించుకుని పూజలు నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి నందిని.

## లంగర్‌హౌస్ వద్ద మూసీలో మునిగిన "బాపూఘాట్"

**- బాధపడుతున్న గాంధేయ వాదులు**

**నార్సింగి, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త :**
భారీ వర్షాల కారణంగా మహోగ్రరూపం దాల్చిన మూసీనది లంగర్‌హౌస్‌లో జాతిపిత పేరుపై ఉన్న "బాపూఘాట్"ను ముంచెత్తింది. ప్రతీ ఏటా మహాత్ముడి జయంతి, వర్ధంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారింగా నిర్వహించే బాపూ సమాది పూర్తిగా మూసీనదిలో మునిగిపోయింది. ఇక్కడ అసలు సమాదే కనిపించడం లేదు. శనివారం ఉదయం లంగర్‌హౌస్-అత్తాపూర్ బ్రిడ్జి పైనుంచి వెళ్లే ప్రజలు బాపూ ఘాట్‌ను మూసీ ముంచేయడంను గమనించారు. ఆ నోటా ఈ నోటా ఈ విషయం గాంధేయవాదుల చెవిన పడింది. చాలా మంది గాంధేయవాదులు అటుగా వచ్చి బాపూ సమాది కనిపించడం లేదంటూ బాధపడ్డారు. ఇక్కడ బాపూజీ సమాది కట్టిన తరువాత మొదటి సారిగా వరద నీటిలో మునిగిపోయిందని స్థానికులు పేర్కొన్నారు. రెండు దశాబ్దాల తరబడి లంగర్‌హౌస్ బాపూఘాట్‌లో గాంధీజీ జయంతి,వర్ధంతి వేడుకలను ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న అన్ని ప్రభుత్వాలు వేడుకలు, ఆ వేడుకలు ముగిసిన తరువాత ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఫలితంగా బాపూ సమాధి వరద నీరు, బురద నీరు, నెలల తరబడి ఊడ్చకపోవడంతో చెత్తతో నిండిపోయినా పట్టించుకోవడం లేదంటూ గాంధేయ వాదులు, స్థానికులు వాపోయారు. గతంలో పలుమార్లు పందులు, కుక్కలు కూడా బాపూ సమాధి వద్ద వచ్చి అక్కడి పరిసరాలను అపరిశుభ్రంగా మార్చేవని, గేటు అమర్చిన తరువాత పరిస్థితిలో కొంత మార్పు వచ్చిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వంలోని పెద్దలు, అధికారులు స్పందించి జాతిపిత మహాత్మాగాంధీ సమాధి వద్ద పరిశుభ్రత, పవిత్రతను పెంచే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.



మూసీ నదిలో మునిగిపోయిన లంగర్‌హౌస్‌లో ఉన్న బాపూఘాట్ దృశ్యం

## మైనారిటీ మద్దతు బిఆర్ఎస్‌కే : కెటిఆర్



జూబ్లీహిల్స్ నియోజకవర్గం సుల్తాన్‌నగర్‌కు చెందిన మైనారిటీ నాయకులు మహ్మద్ నక్షా బందీని కలిసి మద్దతు కోరిన మాజీ మంత్రి కేటీఆర్.

**యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త**
రాబోయే ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలిపించుకునేందుకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవ తీసుకుంటూ మైనారిటీల మద్దతు కూడగట్టుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. నియోజకవర్గంలో మైనారిటీ ఓట్లు అధికంగా ఉండటంతో బలమైన నాయకుడు సుల్తాన్‌నగర్‌కు చెందిన అహ్మద్ నక్షా బంది ఇంటికి వెళ్లి ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు పలకాలని కోరారు. కేటీఆర్‌తో పాటు మాజీ హోంమంత్రి మహ్మూద్ అలీ, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ ఛైర్మన్ మసిఉల్లా, ఇంతియాజ్‌తో పాటు పలువురు మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.


### కెపిహెచ్‌బి పోలీస్ స్టేషన్‌ను సైబరాబాద్ సిపి తనిఖీ

**కెపిహెచ్‌బి కాలనీ, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త**
కెపిహెచ్‌బి కాలనీ పోలీస్ స్టేషన్‌ను సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్ రికార్డులను లాకప్‌ను పరిశీలించారు. స్థానికంగా పోలీస్ స్టేషన్‌లో ఉన్న పెండింగు కేసుల వివరాలను ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులపై తీసుకుంటున్న చర్యల విషయమై పోలీస్ స్టేషన్ సిబ్బంది ద్వారా అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుండి అందే ఫిర్యాదులను అందుకొని వారికి న్యాయం చేయాలని అలాగే శాంతి భద్రతల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సిపి సూచనలు చేశారు.

### మూసి వరద బాధితుల కోసం 10 పునరావాస కేంద్రాలు : కమిషనర్ ఆర్ వి కర్ణన్

**హైదరాబాద్, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త:** మూసి వరద ప్రభావితుల కోసం జీహెచ్ఎంసీ పలు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు మొత్తం 1,467 మంది బాధితులు ఈ కేంద్రాల్లోకి తరలించారు. మలక్‌పేట్, అంబర్‌పేట్, గోషామహల్ సర్కిల్స్ పరిధిలోని పాఠశాలలు, కమ్యూనిటీ హాల్స్, మొదలైన ప్రదేశాలను పునరావాస కేంద్రాలుగా మార్చి బాధితులకు తక్షణ సాయం అందిస్తున్నారు.ఈ కేంద్రాల్లో బాధితులకు భోజనం, తాగునీరు, ఆరోగ్య శిబిరాలు, అవసరమైన వారికి వైద్య సేవలు అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు.జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ స్వయంగా ఈ పునరావాస కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అధికారులు చూడాలని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

### విజయ స్వర్ణ నంది పురస్కారాల ప్రదానం



విజయ స్వర్ణ నంది పురస్కారాల ప్రదానం చేస్తున్న అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త

**చిక్కడపల్లి, సెప్టెంబరు 27ప్రభాతవార్త:** చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో దేవినవరాత్రులు సందర్భంగా శిఖరం ఆర్ట్స్ థియేటర్స్ నిర్వాహకుడు కృష్ణ ఆధ్వర్యంలో సాహిదుర్గె సంగీత నాట్యోత్సవం, విజయ స్వర్ణ నంది పురస్కారాల ప్రదానోత్సవ సభ శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా టిపిసిసి ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త హాజరై పురస్కారాలను ప్రదానం చేసి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో యువకళావాహిని సంస్థ అధినేత లంక లక్ష్మి నారాయణ, డీసీపీ తెజావత్ రాందాస్, అంజనీ కుమారి, బీజేపీ నాయకుడు వంశీ, యోగ టీచర్ వరలక్ష్మి, రమేశ్,అనిత తదితరులు పాల్గొన్నారు.

### తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

**అల్వాల్, సెప్టెంబరు 27 ప్రభాతవార్త:** దొంగతనానికి ప్రయత్నిస్తున్న సమయంలో ఇంటి యజమానురాలు రావడంతో చేతికి చిక్కిన బంగారంతో ఉడాయించిన సంఘటన అల్వాల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మచ్చబొల్లారం ముస్లిం బస్తీలో నివసించే అలీషాభాను కుటుంబ సమేతంగా శుక్రవారం మద్యాహ్నం ఓల్డ్ సిటీలో బంధువులు ఇంటికి వెళ్ళింది. రాత్రి 9 గంటలు సమయంలో అలీషాభాను ఇంటికి తిరిగి రాగా లోపల లైటు వేసి ఉంది. కిటికి నుంచి లోపలకి చూడగా సామాన్లు చెల్లాచెదురుగా పడేసి ఉన్నాయి. ఒక్కసారిగా ఆమె అరవడంతో దొంగ ఇంటి నుంచి పారి పోయాడు. ఏడు తలాలు బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది.

## కళాకారుడు వెంకటేష్‌కు కళా నటరత్న పురస్కారం



వెంకటేష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

**కెపిహెచ్‌బి కాలనీ, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త**
కూకట్‌పల్లికి చెందిన ప్రముఖ కళాకారుడు ఏ.వెంకటేష్‌కు కళా నటరత్న పురస్కారం లభించింది. సర్వేస్వరా నాట్య మండలి హైదరాబాద్ వారు ఈ పురస్కారాన్ని వెంకటేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ నాకు మొదటి నాటక గురువు టి రాజబాబు, బాబు రాజులని నన్ను 1999లో బొబ్బిలి యుద్ధం అనే నాటకం ద్వారా పరిచయం చేసి తరువాత ఎన్నోనాటకాలల్లో నన్ను ప్రోత్సహించిన గురువులని కొనియాడారు. వారి ప్రోత్సాహం వల్ల తాను ఇప్పటి వరకు ఎన్నో నాటికలు, నాటకాలు, సీరియల్స్, సినిమాలు చేస్తూనే వున్నాను అన్నారు. ఇన్ని సంవత్సరాల నుండి ఈ నాటక రంగంలో వున్నాను అంటే నా మొదటి గురువు రాజబాబు అని ఆయనకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు చెప్పారు. ఈరోజు నాకు కళానటరత్న పురస్కారం ఇచ్చి నన్ను ఆశీస్సులు అందచేసినందుకు హృదయ పూర్వక ధన్యవాదములు తెలుపుతున్నట్లు వెంకటేష్ చెప్పారు. గౌరవ అతిధి పెద్దలు కటారి సత్యనారాయణ, విశిష్ట అతిధి గుంపుల సుదర్శన్, ముఖ్య అతిధి పుచ్చా సాంబ శివా రెడ్డి, ఆత్మీయ అతిధి బి వి కాటం రాజు, శ్రీనివాస్‌ల చేతుల మీదుగా నాకు కళానటరత్న పురస్కారం అందించినదుకు ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదములు తెలుపుతున్నానని వెంకటేష్ పేర్కొన్నారు.


### మారేడ్‌పల్లి న్యూక్లబ్‌ను ఫ్రీ హోల్డ్ చేయాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్



మారేడ్‌పల్లిన్యూ క్లబ్‌ను ఫ్రీ హోల్డ్ చేయాలని మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్,క్లబ్ కమిటీ ప్రతినిధులు

**కంటోన్మెంట్,సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ కంటోన్మెంట్ వెస్ట్ మారేడ్‌పల్లిలో ప్రసిద్ధిగాంచిన ఫ్యామిలీ న్యూ క్లబ్‌ను ఫ్రీ హోల్డ్ చేయాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్, క్లబ్ అధ్యక్షులుప్రతాప్‌రెడ్డి,మాజీ అధ్యక్షులు నోముల ప్రకాశ్,ఉపాధ్యక్షులు ప్రశాంత్‌లు శనివారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. దాదాపు 80 సంవత్సరాల చరిత్ర కలిగిన న్యూ క్లబ్ లీజ్ రూపంలో ప్రభుత్వం నుంచి లీజ్ రూపంలో కొనసాగుతుందని తెలిపారు. దాదాపు 3 వేల సభ్యులతో ఉన్న న్యూ క్లబ్‌ను ప్రభుత్వం లీజ్‌ను రద్దు చేసి ఫ్రీ హోల్డ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలోక్లబ్ మెంబర్లు మధుసూదన్, రాజశేఖర్, వెంకట్, వినోద్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ



బతుకమ్మతో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త:** బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక" అని నగర మేయర్ గద్వాల్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి లు అన్నారు. శనివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో బతుకమ్మ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళా అధికారులు, ఉద్యోగినులు, కార్పొరేటర్లతో కలిసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి లు బతుకమ్మ ఆడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ."బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక" అని పేర్కొన్నారు. మహిళా సంక్షేమానికి ప్రజా ప్రభుత్వ పాలన ట్రేడ్ మార్క్‌గా నిలుస్తోందన్నారు. తెలంగాణ మహిళల సాధికారత, సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది అని తెలిపారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు కృషి చేస్తున్నారన్నారు. ప్రజా ప్రభుత్వానికి మహిళలు ఆశీస్సులు అందిస్తూ వెన్నుదన్నుగా నిలవాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మహిళా అధికారులు, కార్పొరేటర్లు పెద్ద ఎత్తున పాల్గొని బతుకమ్మ పండుగను ఆనందంగా జరుపుకున్నారు.

## ఘనంగా అమ్మవారికి కుంకుమార్చన



నవరాత్రుల సందర్భంగా కుంకుమర్చన నిర్వహిస్తున్న మహిళలు

**కొండపాక, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:**
కుకునూరుపల్లి మండల కేంద్రంలో దేవి శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని శనివారం గాధీ విగ్రహం దగ్గర చత్రపతి శివాజీ యూత్ అద్వర్యంలో అమ్మవారిని 6వ రోజు లలితా త్రిపుర సుందరీ దేవి అవతరంలో భక్తులకు దర్శనమిఅచ్చారు. సాముహిక కుంకుమర్చన కార్యక్రమం నిర్వహించి, ఒడిబియ్యం సమర్పించారు.

## లలితాత్రిపురసుందరిగా అమ్మవారు

**చిన్నశంకరంపేట, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:**
శరన్నవరాత్రి ఉత్సవాల్లోభాగంగా మండలపరిధి కొర్విపల్లిలోని ఆలయం లో దుర్గాదేవి అమ్మవారు శనివారం లలితా త్రిపుర సుందరి దేవి అవతారంలో దర్శనమిచ్చారు. అంబాజీపేట, మదూర్, చిన్నశంకరంపేటలో మాలాధార భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.

## బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత సిఎందే



సిఎం చిత్రపటానికి పాలతో అభిషేకం చేస్తున్న దృశ్యం

**చిన్నకోడూరు, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:**
స్థానిక సంస్థ ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్‌లో కల్పించడం హర్షించదగ్గ విషయమని వర్కర్స్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ అంకర్ మధు అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడంతో చిన్నకోడూరు మండల కేంద్రంలో శనివారం లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ల చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత సిఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన సిఎం బీసీలకు పెద్ద మొత్తంలో రిజర్వేషన్లు కల్పించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కోనేటి కర్ణాకర్, బంక చిరంజీవి, మిట్టపల్లి మహేష్, గౌరబోయిన స్వామి, కర్నె శ్రీనివాస్‌రెడ్డి, గంట శ్రీనివాస్, పట్నం కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికలపై శిక్షణ



అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాస్

**సిర్గాపూర్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:**
రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై శనివారి ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల ఎన్నికల అధికారి, ఎంపిడిఓ శారద, మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్‌లు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో ఆర్‌పిలు తుకారం, గణపతి తదితరులు ఉన్నారు.

## వర్షానికి కూలిన ఇంటి గోడ



ముక్తాపూర్‌లో వర్షానికి కూలిపోయిన ఇల్లు దృశ్యం

**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:**
ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండల పరిధిలోని ముక్తాపూర్‌లో ఓ ఇంటి గోడ కూలిపోయింది. గ్రామానికి చెందిన మచ్కూరి జ్ఞానేశ్వర్ ఇంటి గోడ శనివారం కూలిపోవడంతో బాధితుడు తనను ప్రభుత్వం ఆదుకోవాలని వినతి చేస్తున్నాడు.

## ప్రభుత్వ భూమిని కాపాడండి

-తహసీల్దార్‌కు గ్రామస్థుల వినతి



ప్రభుత్వ భూమి అని ఆధారాలు చూపిస్తున్న గ్రామస్థులు

**అల్లాదుర్గం, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని గడిపెద్దాపూర్ గ్రామంలోని సర్వేనంబర్ 863లో 14 ఎకరాల ప్రభుత్వ భూమిని ఓ వర్గానికి చెందిన కొందరు కంచె వేసి కబ్జా చేశారని ఆరోపిస్తూ శనివారం తహసీల్దార్ మల్లయ్యకు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్బంగా గ్రామస్థులు (వేయి మంది వరకు) మాట్లాడుతూ కబ్జాకు గురైన భూమి వద్దకు చేరుకుని కబ్జా చేసిన కంచెను జేసిబి సహాయంతో తొలగించారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారని పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా ప్రయోజనం లేకుండా పోయిందని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ మల్లయ్య సంఘటన స్థలానికి చేరుకుని కబ్జాకు గురైంది ప్రభుత్వ భూమి అని తహసీల్దార్ నిర్ధారించారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# కొలువుల కోసం దిగులు చెందొద్దు

-నైపుణ్యాలు నేర్చుకుంటే అపార అవకాశాలు
-దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

**దుబ్బాక, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:**
నేటి సమాజంలో చదువుకొని ఉన్న యువత ప్రభుత్వకొలువులు రావట్లేదని దిగులుచెందకుండా, విభిన్నరంగాల్లో నైపుణ్యాన్ని (స్కిల్స్) మెరుగు పరుచుకున్నవారికి అపార అవకాశాలు అందివస్తాయని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. నిరుద్యోగ యువత వీటి వైపు దృష్టి సారించాలని ఆయన సూచించారు. శనివారం దుబ్బాక మున్సిపల్ పరిధిలో టాటా సహకారంతో నూతనంగా నిర్మించిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఎటిసి)ను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ఆయన ప్రారంభించారు. ఐటిఐ, ఎటిసిలతో విభిన్నరంగాల్లో ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. యువత ఉద్యోగాలు రావట్లేదని మానసికంగా కుంగిపోకుండా ఐటిఐ, ఎటిసిల్లో చేరి ప్రావీణ్యాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో పిఎస్‌సిఎస్ చైర్మన్ షేర్ల కైలాష్, ప్రభుత్వ ఐటిఐ కాలేజ్ ప్రిన్సిపాల్ జి. కనకయ్య, సూపరిండెంట్ మధుసూదన్, సిబ్బంది ఫిరాజీ, రాజు, నాగభూషణం, అతీఫ్, శ్రీనివాస్, భాగ్యమ్మ, లత, రామకృష్ణ, ప్రభాకర్, బికెఎస్ పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మత్తడి నీరును మళ్లించాలని జాతీయ రహదారిపై రాస్తారోకో



జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న పట్టణ ప్రజలు

**చేర్యాల, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:**
చేర్యాల పెద్ద చెరువు మత్తడి నీరును మళ్ళీంచాలని జనగామ,సిద్దిపేట రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.శనివారం తెల్లవారుజామున వర్షం దంచి కొట్టడంతో పట్టణమంతా జలమయమయింది.దీంతో మత్తడి అలుగు పారి 5,6,7,8,వార్డులతో వీధుల,ఇండ్లతో పాటు మొయిన్ రోడ్ దుకాణా సముదాయాల్లోకి వర్షపు నీరు ప్రవహిస్తుందని కాలనీల్లోని ప్రజలు గాంధీ సెంటర్,చుంచనకోట క్రాసింగ్ వద్ద జాతీయ రహదారిపై పెద్దఎత్తున రాస్తారోకో నిర్వహించారు.మత్తడి నీటిని మళ్ళించి తమ ఇళ్లలోని నీరు రాకుండా చూడాలని అధికారులను డిమాండ్ చేశారు.విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని తమ సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులతో మాట్లాడుతామని వారికి నచ్చచెప్పి రాస్తారోకోను విరమింపజేశారు.

## భారీ వర్షాలతో కర్షకుల కన్నీరు

-నీట మునిగిన పెసర,మినుము, పత్తి



నీటమునిగిన పంటపొలాలను పరిశీలిస్తున ఎఓ మహేష్‌చౌహాన్

**మనూర్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:**
ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు రైతులు సాగు చేసుకుంటున్న పంటలు (పెసర, మినుము, పత్తి తదితర) నీట మునిగిపోవడంతో కర్షకులు కన్నీరు కారుస్తున్నారు. అప్పు సొప్పులు చేసి పండించుకుంటున్న పంటలు నీట మునిగిపోవడంతో దిగుబడి తగ్గడం తథ్యమని తెలుసుకున్న అన్నదాతలు చేసిన అప్పులు తీర్చేదెలా అని, ఇంట్లో శుభకార్యాలు (వివాహాలు) చేసుకునే దెలా అని రైతులు దిగాలు చెందుతున్నారు. చేతికి అందివస్తున్న పంటలను చూసి సంబర పడ్డ అన్నదాతల ఆశాలపై వరుణ దేవుడు నీళ్లు చల్లడడంతో రైతుల ఆశలు ఆవిరైపోతున్నాయి. వరుణుడి ప్రతాపానికి తోడు మంజీర బ్యాక్ వాటర్‌తో పంటలు పూర్తిగా నీట మునిగి ముక్కిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధిక వర్షాలతో ఆగమైన అన్నదాతలను ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని, వ్యవసాయ అధికారులు నీట మునిగిన పంటల వివరాలను ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందచేసి అన్నదాతలు పరిహారం అందేలా చూడాలని మండల రైతులు వినతి చేస్తున్నారు.

## ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులుగా బాల్‌రాజ్

**పుల్‌కల్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:**
పుల్‌కల్ మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులుగా మ్యాతరి బాల్‌రాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ సూచనల మేరకు శనివారం ఎమ్మార్పీఎస్ విహెచ్‌ఎస్ జిల్లా కార్యకర్తల సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు రామరావు శ్రీనివాస్ మాదిగ, రాజు మాదిగ, పెద్ద గీతల సమక్షంలో ముదిమాణిక్యం గ్రామానికి చెందిన మ్యాతరి బాల్‌రాజ్ మాదిగను మండల అధ్యక్షులుగా ఎన్నుకున్నారు.

## న్యాయవాదులను సస్పెండ్ చేయాలి

-డిడబ్ల్యుజెఎస్ జిల్లా అధ్యక్షులు రాజలింగం



విలేకరులతో మాట్లాడుతున్న డిడబ్ల్యుజెఎస్ నాయకులు

**సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:**
సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ హవాయిపై సిద్దిపేట న్యాయవాదులు అనుచిత వ్యాఖ్యాలు చేయడం సిగ్గుచేటని దళిత వర్కింగ్ జర్నలిస్టు సొసైటీ జిల్లా అధ్యక్షులు జంగం రాజలింగం అన్నారు. శనివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సోషల్ మీడియా వేదికగా సిద్దిపేట కోర్టు న్యాయవాదులు శ్రీకాంత్, మురలీమోహన్‌రావులు సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయిపై అనుచిత వ్యాఖ్యాలు చేయడం సరికాదన్నారు. సిద్దిపేట బార్ కౌన్సిల్ వెంటనే అ ఇద్దరి సభ్యత్వాన్ని రద్దు చేయడంతో పాటు తిరిగి ఆ వృత్తిలో కొనసాగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అరెస్టు చేసిన కొద్ది గంటలకే బెయిల్ మంజూరు కావడం ఆ వెంటనే బిస్కెట్లు, స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకోవడం అత్యంత సిగ్గుచేటన్నారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తిపై వ్యాఖ్యాలు చేస్తే కొంత మంది న్యాయవాదులు సమర్థించడం బాధాకరమన్నారు. అనుచిత వ్యాఖ్యాలు చేసిన న్యాయవాదులపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డిడబ్ల్యుజెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్, కోశాధికారి దాసరి చంద్రం, పిఆర్‌ఓ నర్సయ్యలు పాల్గొన్నారు.

## సిర్గాపూర్‌లో వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం



సిర్గాపూర్‌లో వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఐ మహేశ్

**సిర్గాపూర్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం వాలీబాల్ టౌర్నమెంట్‌ను ఎస్ఐ మహేష్ ప్రారంభించారు. అంతకు ముందు పాఠశాల ఆవరణలోని అక్షర స్వరూపిణి శ్రీసరస్వతీమాత విగ్రహానికి పూజాకార్యక్రమాలు నిర్వహించి టోర్నీ ప్రారంభించారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో టౌర్నమెంట్‌లో ఆడాలని ఎస్ఐ మహేష్ సూచించారు. గ్రామీణ క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు కళ్యాణ్‌రావు పాటిల్, మాజీ ఎంపిటిసి సభ్యులు రాజుకుమార్, నర్సాగౌడ్, బాలరాజు, విఠల్, సికిందర్, సాయి, వినోద్, గిరి, అనిల్‌గౌడ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

-ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరు, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:**
పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం ప్రాధాన్యతను తెలియజేస్తూ వారి ఆరోగ్య పరిరక్షణలో అంగన్వాడీల సేవలు ప్రశంసనీయమని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు.శనివారం సాయంత్రం పటాన్‌చెరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో.. అంగన్వాడీశాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని 170 అంగన్వాడి సెంటర్లలో విధులు నిర్వర్తిస్తున్న 170 మంది టీచర్లు, 170 మంది ఆయాలకు రెండు జతల చొప్పున చీరలను ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాత శిశు మరణాల సంఖ్య తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో రామచంద్రపురం మాజీ ఎంపిపి యాదగిరియాదవ్, సిడిపిఓ జయరాంనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలకు 50శాతం వార్డుల రిజర్వేషన్లు

-ఎంపిడిఓ చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ చంద్రశేఖర్

**మనూర్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:**
రానున్న పంచాయతీ ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తున్నట్లు ఎంపిడిఓ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం మండల కేంద్రమైన మనూర్‌లో ఆయా పార్టీల నాయకులతో అఖిలపక్ష సమావేశం మండల ప్రత్యేక అధికారి రఘుబాబు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసి రిజర్వేషన్‌ల వివరాలను వెల్లడించామన్నారు. మండలంలో 22 గ్రామపంచాయతీల్లో 184వార్డులు ఉండగా పురుషులకు 92, మహిళలకు 92 వార్డులను రిజర్వు చేసినట్లు పేర్కొన్నారు. బిసిలకు 42శాతం, ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 10శాతం రిజర్వు చేశామన్నారు. మండలంలో చేసిన రిజర్వేషన్‌ల వివరాల నివేదికను కలెక్టర్ ఆమోదం కొరకు పంపడం జరిగిందన్నారు. కలెక్టర్ ఆమోదం చేసిన వెంటనే ప్రకటిస్తామని ఎంపిడిఓ చంద్రశేఖర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిఓ హైమద్ హుస్సేన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాఘవచారిజోషి, బిజెపి నాయకులు కరణం ఈశ్వరప్ప, మాజీ సర్పంచ్ సిరూర్ సాయిలు, సిహెచ్ సతీష్, మన్నాన్, వెంకట్, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

**స్థానిక సంస్థల ఎన్నికలపై అవగాహన...**
స్థానికసంస్థల ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రతలపై శనివారం మండల కేంద్రమైన మనూర్‌లోని ఇందిరా క్రాంతిపథకం కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సాధారణ ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉపాధ్యాయులకు, విఓలకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఉపాధ్యాయులకు, విఓలకు మండల ప్రత్యేక అధికారి రఘుబాబు, ఎంపిడిఓ చంద్రశేఖర్ ఎన్నికలను పురస్కరించుకుని తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించారు.

## ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి




మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

-మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్

**హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:**
ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్ అన్నారు. శనివారం రోజున పట్టణ కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌లో స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా మార్కెట్‌లో ఉన్న చెత్త, చెదారంతో పాటు రోడ్డును శుభ్రం చేశారు. తడి, పొడి చెత్తను అక్కడే వేరు చేసి మున్సిపల్ కార్మికుల ద్వారా చెత్తను తరలించారు. ఈ సందర్బంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు ఇంటి వద్దనే చెత్తను వేరు చేసి తమ సిబ్బంది అందించాలని వివరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ బాల ఎల్లం, సిబ్బంది శంకర్, రవికుమార్, నవీన్‌తో పాటు జవాన్‌లు ఉన్నారు.

## రిజర్వేషన్‌ల విషయంలో ప్రభుత్వం భారీ కుట్ర

-గిరిజన విద్యార్థిసంఘం రాష్ట్ర అధ్యక్షులు తిరుపతినాయక్




నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజన నాయకులు

**హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:**
రాష్ట్రంలో స్థానిక సంస్థల రిజర్వేషన్‌ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ భారీ కుట్ర చేశారని గిరిజన విద్యార్థిసంఘం రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు తిరుపతి నాయక్ మండిపడ్డారు. శనివారం పట్టణ కేంద్రంలోని సమీకృత భవన సముదాయం ఎదుట గిరిజన నాయకులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, ఈ ప్రాంతం నుండి ప్రాతినిత్యం వహిస్తున్న శాసనభ్యులు, మంత్రి పొన్నం ప్రభాకర్ తన స్వార్థం కోసం ఒక వర్గానికి చెందిన వారికే రిజర్వేషన్‌ల పేరుతో సీట్ల కేటాయింపు చేశారన్నారు. బిసి వర్గాలకు 42 శాతం ఇవ్వాలనే ఉద్దేశంతో మిగతా వర్గాల వారికి అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులకు న్యాయం జరగకుంటే స్థానిక ఎన్నికలను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో నునావత్ మోహన్‌నాయక్, సత్యంనాయక్, మోహన్‌నాయక్, మోతిలాల్‌నాయక్, అనిల్ నాయక్, రైనా నాయక్, తిరుపతినాయక్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి పుల్‌కల్ మండలంలో వార్డుల రిజర్వేషన్‌లు ఖరారు



చౌటకూరులో నాయకులతో సమావేశం అయిన ఎంపిడిఓ

**పుల్‌కల్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:**
ఉమ్మడి పుల్‌కల్ మండలంలోని ఆయా వార్డుల రిజర్వేషన్లు ఖరారు చేశారు. పుల్‌కల్, చౌటకూరు మండల పరిషత్ కార్యాలయాల్లో శనివారం ఆయా మండలాల ఎంపిడిఓలు ఆయా రాజకీయ పార్టీల నాయకులతో ప్రత్యేకంగా సమావేశం అయి లాటరీ పద్దతిలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కేటాయించారు. పుల్‌కల్ మండలంలో 172 వార్డులు, చౌటకూరు మండలంలో 134 వార్డులు ఉండగా లాటరీ పద్దతిలో రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఉమ్మడి పుల్‌కల్ మండలంలో ఎంపిపి, జడ్పిటిసి స్థానాలు, ఎంపిటిసి స్థానాలు సర్పంచ్ పదవులకు రిజర్వేషన్లు ప్రకటించాల్సి ఉంది.

## సుందరీకరణ పనుల్లో వేగం పెంచాలి

-జిల్లా గ్రంథాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి



ఎల్లమ్మ చెరువు పనులు పరిశీలిస్తున్న దృశ్యం

**హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:**
ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనుల్లో కంట్రాక్టర్ వేగం పెంచాలని సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి అన్నారు. శనివారం రోజున పట్టణ కేంద్రంలో జరుగుతున్న ఎల్లమ్మ చెరువు పనులను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈసందర్బంగా మాట్లాడుతూ ఎల్లమ్మ చెరువు కట్టపై బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని పండగ లోపు పనులను పూర్తి చేసి ఆడపడుచులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్, సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, మాజీ ఎంపిపి ఆకుల వెంకట్‌తో పాటు మాజీ కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

## నాదబ్రహ్మోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్

**రామచంద్రాపురం, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:**
హైద్రాబాద్‌లోని శిల్పారామం అన్నమాచార్య భావన వాహిని ప్రాంగణంలో శనివారం నిర్వహించిన నాదా బ్రహ్మోత్సవంలో భారతీ నగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్‌రెడ్డి పాల్గొన్నారు. బారతి నగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్ సొసైటీ కాలనీలో కొనసాగుతున్న దేవీనవరాత్రి ఉత్సవాల్లో కార్పొరేటర్ సింధు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## స్థానిక ఎన్నికలపై అధికారులకు అవగాహన

**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:**
రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై శనివారం మండల కేంద్రమైన నాగల్‌గిద్దలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులు (ప్రిసైడింగ్ అధికారులు)లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రిసైడింగ్ అధికారులకు ఎంపిడిఓ మహేశ్వరరావు అవగాహన కల్పించారు.